'వివశువు' మొదటి రెండుభాగాలు క్రితం సంచికలలో ప్రచురించాము. చివరిభాగం శ్రీ సింగరాజు రామచంద్రమూర్తి వ్రాసినది ఈ సంచికలో ప్రచురిస్తున్నాము.

# వివశువు



## సింగరాజు రామచంద్రమూర్తి

"నమస్కారం" అంటూ చేతులుజోడించింది సరస్వతి. రాజేంద్ర నవ్వుతూ "చదువుకున్నవారు "షేక్‌హాండ్" ఇస్తారని ఎడంచేతిని కోటు జేబులోనే ఉంచాను. ఇప్పు డిక తప్పదన్నమాట!" అని చేతులు కలిపి నమస్కారం చేశాడు.

సువర్చలకి బావ వేసిన విట్టు చాలా బావున్నట్టుంది—పకపక నవ్వేసి "సరస్వతి, మీరు చదివారో లేదో గాని మా నాన్నగారు చెప్పారండి ఒక ఇన్సిడెంటు. సిలోన్‌లో హైకమీషనర్‌గా ఉన్నాయన ఒక పార్టీ చేశాడుట. పార్టీ అంతా అయాక ఆయన ఆయనభార్యా వచ్చినవా రందరికీ షేక్‌హాండ్స్ ఇచ్చారుట. అంతమందితో అలా చేతులు ఊపేసరికి ఆవిడకి జబ్బ దగ్గర ఒక ఎముక ఫ్రాక్చర్ అయిందిట." అప్పటినుంచి ఆవిడ ప్రతివారికి నమస్కారం పెట్టడం ప్రారంభించిందిట" అని మళ్ళీ నవ్వింది.

"ఏడిసినట్టుంది—సరిగా చేతకాకపోతే సరి! సహృదయంతో చేయి అలా పట్టుకున్నప్పుడు ఒక రకమయిన ఆత్మీయత వస్తుంది. అంతేకాని మైలు దూరంగా నిలబడి నమస్కారం అంటే సరిపోతుందా? అసలు ఫారిన్ కల్చరుని గురించి ఆలోచిస్తే ప్రతిదాంట్లోనూ ఇంటెలిజన్స్, బ్రిలియన్స్ కనబడుతుందండి సరస్వతిగారూ! అంతవరకు ఎందుకు — మన ఇండియాలోని ఒక మతం తీసుకోండి—చెప్పులు విప్పి ఒకరి నొకరు ఆప్యాయంగా కౌగలించుకుంటారు. ...."

సరస్వతి ఇవేమీ వినిపించుకునే స్థితిలో లేదు. కేవలం సభ్యత కోసం వింటున్నట్టు నటిస్తున్నా మనస్సంతా అల్లకల్లోలంగా ఉంది ఆమెకి.

ఇంతలో హడావుడిగా సూర్యారావుగారు వచ్చి—

"ఏమిటోయ్, ఆవిడ్ని అలా నిలబెట్టేసే మాట్లాడుతున్నావ్? .... అమ్మాయ్ సరస్వతీ, మనవా డున్నాడు చూశావూ, మాట్లాడటం మొదలెట్టాడా అలా సరుక్కుంటూ పోవడమే కాని ఎక్కడాపాలో తెలియదు. అందులోనూ ఆ 'ఫారిన్' విషయాలు ఎత్తావంటే అక్కడ ఎన్నాళ్ళున్నాడో మళ్ళీ అన్ని రోజులూ చెప్పందే వదలడు— ఏరా అంతేనా? .... ఆఁ .... అన్నట్టు ఇంతకీ నేను వెతుకుతున్నది ఏమిటి చెప్మా" అన్నా రాయన సాలోచనగా.

"కళ్ళజోడా!" అడిగింది సువర్చల నవ్వు దాపుకుంటూ.

"ఆఁ .... చూశావా ?"

"నీ చేతిలో పట్టుకున్నావుకద నాన్నా" ఫక్కున నవ్వేసింది.

ఆయన గబుక్కున దాన్ని చూసుకుని "అయితే దీనికోసం కాదన్నమాట మరేమిటబ్బా .... ఆఁ

42-వ పేజీ చూడండి

వీకోసమే—వెళ్ళ వెళ్ళ, మీ అమ్మ నిన్ను అర్జంటుగా రమ్మంది.....అమ్మయ్య" అంటూ హడావుడిగా వెళ్ళిపోయారు.

సరస్వతి కూడా నవ్వకుండా ఉండలేకపోయింది. అన లాయన్ని చూస్తేనే ఎవరో ఆత్మీయుల్ని చూసినట్టుటుంది సరస్వతికి. చిన్న పిల్లాడిలాగా అనవసర విషయాల్లో మతిమరుపు, గలగల నిష్కల్మషంగా మాట—ఒక్కొక్కసారి తన శిష్యుడు రాంబాబుకి ఆయనకి తేడా లేదనిపిస్తుంటుంది. సువర్చల అంతా సుశీలమ్మగారి పోలిక. వారికి కావలసింది కుటుంబ సౌఖ్యం. దాని కేమయినా అపాంతరాలొస్తే సహించలేరు.

"మావయ్యకి మతిమరుపుకి మంచి మందిప్పించాలి .... కొందరికి అందమయినవారు ఎదట ఉన్నప్పుడు మతిమరుపు వస్తుందిట. ఉదాహరణకి మావయ్య రాని క్రితం నేనేదో చెబుదా మనుకుంటూనే ఇప్పుడు మర్చిపోయాను" అని సిగరెట్టు వెలిగించుకుంటూ ఆమెవంక చూసి నవ్వాడు రాజేంద్ర.

సరస్వతి దానికేమి సమాధానం చెప్పకుండా "లోపల పిన్నిగారు ఒక్కరూ బాధపడుతున్నట్టున్నారు" అని జనాంతికంగా అని గబగబ లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవైపే చూస్తూ ఆమె రూపాన్ని నెమరు వేసుకుంటూ నిలబడ్డాడు రాజేంద్ర.

ఆర్థికంగానూ, విద్యలోనూ ఉన్న ప్రత్యేక కస్థానాన్ననుసరించి అభిరుచులు కూడా ఉండాలన్నది రాజేంద్ర ఆశయం. కనుకనే అతను సౌందర్యారాధకుడయ్యాడు. ప్రకృతి కానీయండి, పడతి కానీయండి—అందాన్ని ఆస్వాదించాలని అతని ఉద్దేశం. లక్షాధికారులయిన హీరోలు పొడుగుపాటి గౌనులు వేసుకుని చిత్రలేఖనం బ్రష్‌లు పుచ్చుకుని తిరగడం సినిమాల్లో చూసిఉన్న వాడవటం వలన కొద్దో గోప్పో అది కూడా అభ్యసించాడు. అందుకే అతను 'చిత్రకారుడి దృష్టి'తో సరస్వతిని, సువర్చలని తూచి చూసుకున్నాడు.

"అరవిచ్చిన పువ్వువంటిది సువర్చల. సువాసనలు వెదజల్లుతూ సౌందర్యాన్ని గుమ్మరించి చూచే వారిని ముగ్ధుల్నిచేసే అందం సరస్వతిది" అనుకున్నాడు రాజేంద్ర.

అక్కడి హడావుడి అంతా అయి సరస్వతి బయట పడేసరికి చీకటి పడిపోయింది. ఏదో నలుగురి మధ్య తిరుగుతూ, పనులు అందుకుంటూ గడిపేయటంవలన మరిచిపోయిన ఆలోచనలు మళ్ళీ మునురుకున్నాయి. మధుమూర్తి మూర్తి కళ్ళ ఎదుట కట్టినట్లయింది.

అతని అదృశ్యానికి తనెంతవరకు బాధ్యురాలు? తను తనకి తెలియకుండానే అతన్ని ప్రోత్సహించిందా? అతనితో పరిచయమయినప్పటినుంచి విడిపోయేవరకు తన మాటల్లోగాని, చేతల్లోగాని అతనిలో ఆశలు రేకెత్తించేవిధంగాఉందా తన ప్రవర్తన? అని తన్ని తనే ప్రశ్నించుకుంది. గత సన్ని వేశాలన్నిటిని సింహావలోకనంచేసి చూసుకుంది

అతనితోగల పరిచయంవలన ఆమె గ్రహించినది అతను పసిపిల్లాడంత అమాయకుడని, అలాగే ఉద్రేక స్వభావం కూడా కలవాడనీను. ప్రతి చిన్న

# వివశువు

(23-వ పేజీ తరువాయి)

విషయానికి బాధపడటం, తనుపొందాలనుకున్న వస్తువు దూరమయితే భరించలేని మనస్తత్వమని. అందుకనే ఆమె అంతగా భయపడేది—తనకి తెలియకుండానే అతన్ని తనవైపుకు తిప్పుకున్నానా అని.

ఆలోచనల్లో కొట్టుకుపోతున్న సరస్వతికి ఎదురుగా వస్తున్న ప్రసాదరావు దగ్గరగా వచ్చేంతవరకు కనబడలేదు.

అయితే అతను తన్ని చూసి కూడా చూడనట్లు తలవంచుకునిపోతుంటే ఆశ్చర్యంవేసి, "ప్రసాదరావు గారు" అని తనే పిలిచింది

సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్లో భర్త ఆఫీసరుగా, భార్య గుమాస్తాగా పని చేస్తున్నారు. ఒకరోజు భర్త బాల బాలికల వసతి గృహములకు మంజూరు చేసిన బిల్లులు, పంపిన రసీదులు చూస్తూ, తన పేర వంద రూపాయలు వ్రాసి వుండడం చూశాడు.

ఆఫీ (భర్త):-అదేమిటి వంద రూపాయలు నా పేరిట ఖర్చు వేసి వుంది.

గుమాస్తా (భార్య):-అదేనండి! మనపిల్లల చదువులకు మీరేగా వంద రూపాయలు మంజూరు చేశారు.

జూపల్లి మల్లి ఖార్జునరావు (తిరుపతి)

ఆగి ఆమె దగ్గరకు వచ్చాడు.

"ఈమధ్య మీరు కనబడి చాలా రోజులయింది" అంది అతనివంక పరిశీలనగా చూస్తూ.

అతనేమీ మాట్లాడలేదు. మనిషికి గడ్డం మాసి దిగులుగా ఉన్నట్టు కనబడ్డాడు ఆమె కంటికి.

"అలా ఉన్నారేం?" అంది.

అతను కొంచెం కలవరపడి, "ఏం ఎలాఉన్నానంటారు?" అన్నాడు నిర్జీవంగా నవ్వేందుకు ప్రయత్నిస్తూ. . . .

"ఇవ్వాళ మీరు సుశీలమ్మగారింటికి కూడా రాలేదు!"

"అవును" అన్నాడు తలవంచుకునే.

"ఆవిడ ఎంత బాధపడ్డారో తెలుసా? మీ రింకా వస్తారు ఇంకా వస్తారని మేమంతా ఎదురుచూశాం"

తలెత్తి ఆమె వంక చూసి, "పనులుండటం వలన రాలేకపోయానండి. ఈమధ్య క్షణం తీరుబడి ఉండటంలేదు"

"ఆదాయం కూడా ఉన్నట్టులేదు మీ వాలకం చూస్తుంటే" అని నవ్వింది.

అతనూ నవ్వాడు. తరువాత కాసేపు ఇద్దరూ మాట్లాడలేదు. తన మనస్సులో నలుగుతున్న విషయం ఎలా చెప్పటమా అని కాసేపు తటపటాయించి చివరికి—

"మధుమూర్తిగారు వెళ్ళిపోయారు తెలుసా?" అంది మెల్లిగా.

ప్రసాదరావు కొద్దిగా ఆశ్చర్యపడి, "వెళ్ళిపోతాడనే అనుకున్నానులెండి" అన్నాడు బరువుగా.

అతనిమాటలోనిభావం గ్రహిద్దామని ప్రయత్నించి చివరికి "అలాగన్నారేం?" అంది.

"నలుగురిలో తిరగ నేర్చి, నాలుగు దెబ్బలుతిని అనుభవంసంపాదించినవాళ్ళు వేయబోయే ప్రతి అడుగూ తూచివేస్తారు. ప్రతి విషయానికి పూర్వాపరాలు ఆలోచిస్తారు. కాని కొందరు ప్రపంచం అంతా వాళ్ళలాగాన్నే ఉంటుందనుకుంటారు. వాళ్ళు ఆవేశపరులు. మనస్సులోకి ఆలోచనవస్తే అది బయటపెట్టేదాకా నిద్రపోరు. దాన్ని గురించిన సమాధానం వచ్చేదాకా అవతలి వాళ్ళని నిద్రపోనీయరు. ఒక్క ముక్కలో చెప్పాలంటే వాళ్ళు మానసికంగా పసిపిల్లలన్నమాట. ఇట్టే ఉద్రేకపడతారు. ఆశించినది అందకపోతే భరించలేరు. అంత సున్నితం వాళ్ళ హృదయం. సాధారణంగా రచయితలు, కళాకారులు ఈ కోవలోకి వస్తారు. కాని జీవితంలోమట్టుకు వీళ్ళు దెబ్బతినక తప్పదు. ఆ దెబ్బకి తట్టుకు నిలబడగలశక్తిలేక ఇదుగో ఇలాగే రాత్రికి రాత్రి పారిపోతారు. . . .చాలా చీకటి పడినట్టుంది. నేను కాంపుకి పోతున్నాను మరి వస్తా" అని అంటూనే వెళ్ళిపోయాడు ప్రసాదరావు.

కుదుటపడుతున్న మనస్సు మళ్ళీ సంక్షుభితమయింది సరస్వతికి. . . .

రాత్రి తొమ్మిది గంటలయినా సరస్వతి గదిలో దీపం వెలగకపోవడం చూసిన అన్నపూర్ణమ్మగారు, "ఇందాకనగా వచ్చింది—పిచ్చిపిల్ల, భోంచేయకుండానే పడుకుని నిద్రపోతున్నట్లుంది" అనుకుంటూ వోరగా వేసిన తలుపులు తోసుకుని లోపలికి వచ్చింది. కిటికీగుండా పడుతున్న వీధి దీపం గుడ్డివెలుగు తప్పించి గదంతా చీకటిగా ఉంది.

కుర్చీమీద కూర్చుని డ్రాయరుమీద తలపెట్టుకుని చేతులతో తలని కప్పుకునిఉంది సరస్వతి. ఆవిడకి ఆశ్చర్యం కలిగి స్విచ్చివేసింది.

వెలుగుకి ఉలిక్కిపడి తలెత్తింది సరస్వతి. బుగ్గలమీద కట్టిన చారికల్లో దీపపుకాంతి ధళధళలాడింది.

"అదేమిటి సరస్వతీ—ఏడుస్తున్నావా?" అంది ఆశ్చర్యంగా ఆవిడ.

ఖంగారుపడిపోయి, "ఏబ్బెబ్బె, లేదు పిన్నిగారూ" అని కళ్ళు తుడుచుకుంది సరస్వతి.

ఆ అమ్మాయి పరిస్థితిచూసి జాలేసింది అన్నపూర్ణమ్మగారికి. ఆమె దగ్గరిగావచ్చి, తలమీద చేయివేసి నిమురుతూ—"చూడు సరస్వతి, నువ్వు

వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను. మనస్సులో ఏదో బాధ పెట్టుకుని బయటికి ఆనందంగా కనుబడాలని ప్రయత్నిస్తున్నావు! అసలు ఏదో పెద్ద కారణం లేనిదే 'నా' అన్న వా రందరిని వదిలి ఈ వయస్సులో పిల్లలు, అందులోనూ నీలాంటివాళ్ళు రారు. నాకు చెప్పవూ ఆ బాధ ఏమిటో?" అంది సానునయంగా.

ప్రేమగా, కన్నతల్లిలాగా అన్న ఆ మాటల్తో సరస్వతి దుఃఖం కట్టలు తెంచుకుంది. చెప్పేద్దామని నోరు తెరిచి కూడా చెప్పలేక ఆవిడ చేతుల్లో తన ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడవ సాగింది.

అన్నపూర్ణమ్మగారికి కూడా కళ్ళు చెమ్మగిల్లాయి. "వెర్రితల్లీ, జీవితంలో ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా ధైర్యంగా నిలబడాలిగాని ఇలా బెంబేలు పడిపోతారా చదువుకున్నదానివి కూడా. లే, లే భోంచేద్దువుగాని అంటూ లేవదీసింది ఆమె.

* * *

"నిన్నటిపాఠం నీకు సరిగా రాలేదు బాబూ! కాబట్టి నిన్నటిది, ఇవ్వాళ్టిది రేపు అడుగుతాను. లెక్కలు కూడా చేసి చూపించాలి" అంది పాఠం చెప్పడం పూర్తిచేసిన సరస్వతి.

వాడు గబుక్కున, "మరేమోనండి మాస్టారూ, ఇవాళ మా అక్కయ్య, రాజేంద్రంబావ సినిమాకి వెడతారుటండి" అన్నాడు. పాఠం చెప్పించుకున్నంతసేపూ వాళ్ళతో, తనూ వెళ్ళటం ఎలాగా అన్నదే రాంబాబు ఆలోచన.

సరస్వతికి అతని మాటలకి నవ్వొచ్చింది. "ఈ పాఠాలన్నీ అప్పగించితే రేపు మనిద్దరం అదే సినిమాకి వెడదాం— సరేనా?" అంది.

సరిగా అప్పుడే లోపలికి వస్తున్న రాజేంద్ర "రేపెందుకు. ఇవ్వాళే రండి మీరు కూడా—ఏరా టార్జాన్ సినిమాకి వస్తావా?" అనడిగాడు.

"ఓ—మనం కూడా ఇవ్వాళే వెడదాం మాస్టారూ"

"నేను రానులే, నువ్వు వెళ్ళు" అంది సరస్వతి లేచి నిలబడుతూ.

"అలాకాదు. మీరూ రావాలి—కంపెనీ సరదాగా ఉంటుంది" అవకాశాన్ని జారవిడుచుకోవడం ఇష్టంలేదు రాజేంద్రకి.

సరస్వతికి ఈ సన్నివేశం వెగటు కలిగించింది. "నేను రాంబాబుని హోదార్చేందుకు మాత్రం అన్నాను ఆమాట!" అంది.

"పోనీ, ఇప్పుడు మేమంతా అడుగుతున్నాంగా రాకూడదూ—మా అత్తయ్య కూడా వస్తుంది."

మేకప్ పూర్తి చేసుకుని బయటపడిన సువర్చలకి రాజేంద్ర మాటలు ఆశ్చర్యం కలిగించాయి. "అమ్మా! అమ్మ రావటం ఏమిటి బావా సినిమాకి. .."

రాజేంద్రలో సహనం నశించింది. "అదేనోయ్, అత్తయ్య వస్తేకాని సరస్వతిగారు రానన్నారు. అందుకని అత్తయ్య కూడా వస్తుంది."

సరస్వతి తెల్లబోయింది.

సువర్చల మాత్రం "రండి సరస్వతీ—మీరూ వస్తారని అనుకోలేదు సుమీ! మా అమ్మని తయారు చేస్తాను" అంటూ వెళ్ళిపోయింది లోపలికి.

కారు డ్రైవు చేస్తూ—

"స్టేట్సులో కార్ రేసెస్ జరుగుతాయత్తయ్యా చూచి తీరాలనుకో! అందులో కొంతమంది చామికేలు కూడా దొరక్కుండా పోతారు. అసలా రోడ్లే వేరు. ఆ ట్రాఫిక్కే వేరు" అన్నాడు రాజేంద్ర.

బావ మాట్లాడుతున్న ప్రతిమాటని కళ్ళు ఇంతింత చేసుకుని వింటున్నారు సువర్చలా, రాంబాబు.

"...సరస్వతిదేవిలాంటి తెలివి తేటలున్న వాళ్ళని, తప్పకుండా ఫారిన్ తీసుకుపోవాలత్తయ్యా—అప్పటికికాని వీరిలో మరుగుపడిన ప్రతిభ గుర్తించడం జరగదు."

ఇలా హఠాత్తుగా తన ప్రసక్తి తెచ్చినందుకు బాధపడింది సరస్వతి. "ఏమిటి ఈయన ఉద్దేశం. వాళ్ళు ఏమయినా అనుకుంటారని కూడా ఆలోచించడేం?" అని.

సుశీలమ్మగారు నవ్వేసి, "రేపు నీ పెళ్ళాన్ని తీసుకెళ్ళు—'ఎలిజబెత్ టెయిలర్ని' చూస్తుందిట" అంది

సినిమా హాల్లో సుశీలమ్మగారిపక్కన సరస్వతి కూర్చుంటే ఆమె పక్కన రాజేంద్రవచ్చి కూర్చుని తనకి రెండవ ప్రక్కన సువర్చలని కూర్చోమన్నాడు. సరస్వతికి ఏంచేయాలో తోచలేదు. లేచి సీటు మారుద్దామంటే అసభ్యంగా ఉంటుంది. పైగా అతనికి ఎటువంటి దురుద్దేశం లేదేమో? అని సమాధానపడి అలానే ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చుంది.

---

ఒకరు:—ఏమండీ! గతకొన్ని సంవత్సరాలనుండి బెంగచేత నా ఆరోగ్యం పాడైపోయిందండీ!

మరొకరు:—దేనికోసం బెంగండీ!

ఒకరు:-నా ఆరోగ్యంగురించే నండీ!

కె. రాధాకృష్ణమూర్తి (హైదరాబాదు)

---

సుశీలమ్మగారు కొడుకువేసే ప్రశ్నలతోటే, వాడు ఏడిచి మరాంచేసే చిరుతిండ్లు కొనటంతోటి సతమతమయిపోతోంది.

తన చేతిమీద రాజేంద్ర చేయివేసి మెల్లిగా నొక్కడంతో ఉలిక్కిపడి చేయి వెనక్కి తీసేసుకుంది సరస్వతి.

"ప్రతిదానికి మరీ అంత భయపడిపోతారేం" అన్నాడు నవ్వుతూ రాజేంద్ర.

కొంచెం మందలిద్దామని అనుకుందిగాని అనవసరంగా రభస చేసినట్లవుతుందని భయపడి వూరుకుంది సరస్వతి.

* * *

"ఇవ్వాళ తాడో పేడో తేల్చేయాలి" అనుకున్నాడు రాజేంద్ర రాంబాబు ప్రయివేటు చెప్పించుకునే గదిలో కూర్చుని.

పుస్తకాలు పుచ్చుకుని లోపలికి వచ్చిన రాంబాబు, "ఏంబావోయ్, నువ్వు మాస్టరమ్మగారిదగ్గర పాఠం చెప్పించుకుంటావా?" అనడిగాడు ఆశ్చర్యంగా.

"అవునోయ్ టార్జాన్. ఇవ్వాళ నేను చెప్పించుకుంటానుగాని నువ్వు హాయిగా పడుకో. ఈ డబ్బు పుచ్చుకుని మంచి మపుతార్గన్ కొనుక్కో" అంటూ వాడినితోలేశాడు.

గదిలోకి అడుగుపెట్టిన సరస్వతి లోపలి రాజేంద్రనిచూసి వెనకంజ వేయబోయింది.

"రండి. మీతో ఒక విషయం మాట్లాడాలి—అందుకే వెయిట్ చేస్తున్నాను. కూర్చోండి" అన్నాడు రాజేంద్ర తాపీగా.

సరస్వతి వంగతి పసిగట్టి బెరుగ్గా కూర్చుంది.

టేబుల్‌మీదఉన్న టైమ్‌పీస్‌వంక కాసేపు విశితంగాచూసి ప్రారంభించాడు రాజేంద్ర—

"నా కే విషయమయినాసరే— సూటిగా మాట్లాడటం అలవాటు. అలాగే ఇది కూడా చెపుతాను. మీరు మధ్యలో అడ్డు రావద్దని, నే చెప్పేదంతా పూర్తిగా విని మాట్లాడమని నా కోరిక" అని కాసేపాగి, "నేను మిమ్మల్ని చూసిన రోజునుంచి మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మిమ్మల్ని మారేజి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాను" అన్నాడు.

సరస్వతి కలవరపడిపోయింది. భయంగా చుట్టూ చూస్తూ, "క్షమించండి! నాకు అటువంటి......" మాట పూర్తి కానియ్యకుండానే అందుకున్నాడు రాజేంద్ర.

"మొదటే చెప్పాను మిమ్మల్ని పూర్తిగా వినమని. . . ప్రేమించేందుకు నీకుగల అర్హత లేమిటి అని అడుగుతారేమో! చెబుతాను. 'ఫారిన్'లో 'డాక్టరేట్' తీసుకున్నాను. ఉద్యోగం తేలికగా వస్తుంది నాకు. స్థిర చరాస్తులన్నీ కలిపి పది, పది హేను లక్షలమధ్య ఉంటుంది మా ఆస్తి. నే నొక్కడినే సంతానం మా అమ్మకి. నాన్నగారు పోయారు. రూపం మీరు చూస్తున్నదే. ఇక నా అదృష్టాన్ని పరీక్షకి పెడుతున్నాను ఈ నిర్ణయం చెప్పండి" అన్నాడు. . .

సరస్వతి మాట్లాడేలోగానే సువర్చల గబగబ వచ్చింది లోపలికి. "నిన్ను నాన్నగారు పిలుస్తున్నారు బావా" అంది కంగారుగా.

ఒక సారి సరస్వతివంకచూసి అయిష్టంగానే బయటికి వెళ్ళిపోయాడు రాజేంద్ర.

అతన్నలా పోనిచ్చి సువర్చల సరస్వతి చేతులు పుచ్చుకుని, "మా బావని నానుంచి వేరుచేయకు సరస్వతీ!" అంది. సరస్వతి ఉలికిపడి సువర్చల ముఖంలోకి చూసింది.

ఆమె కండ్లు నీళ్ళతో నిండి ఉన్నాయి!

ఆ అమాయకురాలికి ఏం చెప్పాలో, ఏం చెబితే తన మనస్సు ఆ అమ్మాయికి తెలుస్తుందో అర్థం కాలేదు సరస్వతికి. "నీ కొచ్చిన భయమేమీలేదు సువర్చలా. మీ బావ అక్షరాలా నీవాడే!" అని, ఇక అక్కడ ఉండలేక లేచి ఇవతలికి వచ్చేసింది.

ఎందుకింత అపార్థం చేసుకుంది సువర్చల తన్ని—అన్న ప్రశ్న ఆమెను వేధిస్తోంది. గబగబ అడుగులు వేసుకుంటూ వీధిలోకి రాబోయిన సరస్వతిని గుమ్మంలో సుశీలమ్మగారు ఆపి, "నువ్వీఇంటికి ప్రయివేటు చెప్పేందుకు మాత్రం వస్తున్నావని గుర్తుంచుకో. ఈ ఇంటికి ఎంతో ఋణపడి ఉన్నావని మర్చిపోకు" అంది కటువుగా.

తల్లిలా భావించిన సుశీలమ్మగారి నోట ఇటువంటి మాటలువిని ఒణికిపోయింది సరస్వతి—"మర్చిపోను పిన్నిగారూ, నా జీవితం ఒక దారిన నడిచేట్టు చేశారు—అందుకు సర్వదా కృతజ్ఞురాలిని. ఇక నుంచి మీకే భారం ఇవ్వను. మీరు అంగీకరిస్తే

శలవు తీసుకుంటాను" అనేసి, తూలిపోతూ వెళ్ళి కంటికి కనబడిన రిక్షాలో కూలబడింది.

ఆమె హృదయంలో అగ్ని పర్వతాలు బగులుకుంటున్నాయి. మస్తిష్కంలో అణు బాంబులు బగులుతున్నాయి. . . .తల్లిలా ఆదరించిన సుశీలమ్మగారు కూడా తన్ని అపార్థం చేసుకుంది. అసలీ ప్రపంచమే అంతా? ఒంటరిగాఉండే ఆడదానికి రక్షణ లేదా? . . . .అంతులేని గొలుసులా ఆలోచనలు, "ఇప్పుడు తనేం చేయాలి" అన్న దరిలేని సముద్రం వంటి ప్రశ్న ఆమెను ఎదుర్కొన్నాయి.

"ఎక్కడికి పోనీయమంటారమ్మా ?" అడిగాడు రిక్షావాడు.

"పబ్లిక్ గార్డెన్‌కి" అనాలోచితంగానే అనేసింది

వేళకానివేళ కావడాన గార్డెన్ పల్చగా దిగులుగా ఉన్నవాడి మనస్సులా ఉంది. అంతక్రితం ఒక తడవ కురిసిన వర్షానికి తడిసిన చెట్లు మధ్య మధ్య కన్నీరు కారుస్తున్నాయి.

వాటిమధ్య ఎంతసేపు కూర్చుందో ఆమెకే తెలియదు "క్షమించండి" అన్న మాటతో తలెత్తి చూసింది

రాజేంద్ర.

"మీరు నానుంచి అక్కడవద్ద ఘర్షణ అంతా విన్నాను. నా రెవరో ఏదో అనుకుంటారని జీవితాన్ని పాడు చేసుకోవడం నాకు నచ్చదు. ఇందాక మీ సమాధానం వినలేకపోయాను. ఇప్పుడు చెపుతారా?" అనడిగాడు.

ఔను తనింక దాచి ప్రయోజనం లేకపోగా, అనవసరమయిన చిక్కులు ఉత్పన్న మవుతున్నాయి. ఒక దృఢ నిశ్చయానికి వచ్చిన దానిలా అంది—

"చూడండి రాజేంద్రగారూ, ఈ విషయంలో నా నిర్ణయం ఎటువంటిది అన్న విషయంకన్న ముఖ్యమయినది మరొకటుంది. నే నెవరినో ఈ ఊరురానిక్రితం నా చరిత్ర ఎటువంటిదో మీ కెవరికీ తెలియదు. తెలిసిననాడు నన్ను హీనంగా చూడవలసినంతటి తప్పు పనులు నే నేమీ చేయలేదు గాని "ఇటువంటి" కోరిక మాత్రం కోరరు."

రాజేంద్ర ఏమీ మాట్లాడలేదు.

"కొందరి జీవితాలు వడ్డించిన విస్తరిలా, పూలబాటమీదుగా సాగిపోతాయి. కాని మరికొందరు అందుకు భిన్నంగా పుడతారు. భగవంతుడి సృష్టిలోని వైవిధ్యం అదే! అలా ఉండకపోతే 'అదృష్టం' అన్న మాటకి అర్థం ఉండకపోయేది. నేను రెండవ కోవకి చెందిన దాన్ని.

పుట్టగానే తలితండ్రుల్ని పోగొట్టుకున్న నన్ను మామయ్య చేరదీశాడు. ఆయనకి చాలామంది పిల్లలు—ఉద్యోగం చిన్నగుమాస్తా. ఇక నే నెలా పెరిగానో ఊహించుకొండి. అలాగే వీలు చేసుకుని చదువుకున్నాను సాధారణంగా ఆస్థితిలోఉండే కుటుంబాల్లో లాగా నా వివాహం మావయ్యకి పెద్ద సమస్యేమీ కాకపోగా, ఆయనకున్న సమస్యల్ని కూడా తీర్చేదిగా పరిణమించింది.

వయస్సు మళ్ళిన ఒక లక్షాధికారిని స్థిరపరిచాడు మావయ్య. ఎవరితో చెప్పుకోను? నా జీవితం నాశనం చేయవద్దని ఏడుస్తే వినేదెవరు? . . . అంతా సక్రమంగా జరిగి నేనొక ఇంటిదాన్నయాను. నిజం చెప్పాలంటే నేను అంతవరకు సుఖపడిన రోజులవే. ఆయన లక్షాధికారి. సుఖమంటే ఎరగనిదాన్ని, డబ్బుని చూడనిదాన్ని నేను. అటువంటి దాన్ని నేను కొన్నాళ్ళు డబ్బు కొనిచ్చే సుఖాల్ని మాత్రం పుష్కలంగా అనుభవించాననే చెప్పాలి.

మామయ్య కుటుంబం కూడా రెండు పూటలా భోజనంచేసే వసతి ఏర్పరుచుకుంది. ఇలా ఉండగా హఠాత్తుగా గుండె జబ్బువలన ఆయన పోయారు. నాకు సంతానం లేకపోవటాన, ఆస్తి నంతటినీ దాయాదులు వశపరుచుకుని సంవత్సరానికి నాకు తిండికి, బట్టకి భరణం ఏర్పాటు చేశారు.

నేను మళ్ళీ మావయ్యగారింటికి చేరుకున్నాను. కాని ఆ వాతావరణం భరించలేకపోయాను. కొన్నాళ్ళపాటు సుఖం అనుభవించడం వలసిన నాకు అప్పటి పరిస్థితుల్లో వ్యత్యాసం కొట్టవచ్చినట్టు కనబడేది. ఇంట్లో ఆదరణ లేకపోవడం—ఒకవిధంగా, ఇవన్నీ నాలో తెగింపు నిచ్చాయి. చదువుకున్నదాన్ని— నా కాళ్ళమీద నేను బ్రతకలేనా? అనిపించింది. పైగా, పెళ్ళి ముచ్చట కూడా తీరిపోయింది.

అంతే—హైదరాబాదు వచ్చేశాను. ఇంతకీ నేను చెప్పవచ్చేది నేను వివాహితని—విధవను ఇంకా మీకు నన్ను చేసుకోవాలనే ఉందా?" సూటిగా అడిగింది.

మాట్లాడలేదు రాజేంద్ర.

పేలవంగా నవ్వింది సరస్వతి. "ఒద్దు రాజేంద్ర గారూ, అటువంటి నిర్ణయానికి రావద్దు మీరు. సువర్చల నాకు చెల్లెలు లాంటిది అమాయకురాలు. మిమ్మల్ని మనస్సులో దాచుకుని ఆరాధిస్తోంది. స్త్రీ ఆరాధించటం మొదలెడితే ఆ మగాడు ఎంతటి అదృష్టవంతుడో చెప్పలేం. మీరు నన్ను నిజంగా ప్రేమించినట్లయితే నాకోసమయినా సువర్చలని చేసుకోండి—మీరు కాదంటే సువర్చల బతకలేదు!" అంది ఆవేశంగా

ఆమె మాటలు రాజేంద్రని కదిలించేశాయి. విస్మరించిన కర్తవ్యం గుర్తుకు వచ్చిన వాడిలా, "మీ మాట తప్పక నెరవేరుస్తాను సరస్వతీ— మరి గుడ్‌బై" అంటూ గబగబ వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళినవైపుచూసి నిట్టూర్చి లేచి నిలబడింది—సరస్వతి తనీఊరువచ్చి సాధించిందేమిటి? మానవత్వంకల మనుష్యులతో పరిచయం ఏర్పరుచుకుని వారికి ఆత్మీయురాలినయానని తృప్తిపడింది ఇన్నాళ్ళు! కాని ఆమె కట్టుకున్న బంగారుమేడ కూలిపోయింది. తన విషయం పూర్తిగా తెలిసుండి కూడా తన కూతురు సుఖానికి అడ్డు రాబోతున్నదన్న తొందరలో సుశీలమ్మగారు తన్ని అపార్థం చేసుకుంది. సువర్చల తన బావని తననుంచి వేరు చేసేందుకు ప్రయత్నించిందని భ్రమపడింది. రాజేంద్ర తొందరపాటువలన ఆ ఇంటికీ తనకీ ఋణం తీరిపోయింది

మధుమూర్తి తన జీవితంలోంచి నిష్క్రమించాడు. ఇక మిగిలింది ప్రసాదరావు. అతని క్కూడా తన గతం తెలుస్తే అతనూ తన ముఖం చూడడు. మళ్ళీ తను ఏకాకి. 'నా' అన్నవాళ్ళులేని ఈ ఊళ్ళో, సహృదయంతో ప్రేమగా పలకరించే వారిని గోల్పోయిన తను ఉండి ప్రయోజనం ఏమిటి? ఏ లక్ష్యం సాధిద్దామని? గత జ్ఞాపకాల శృంఖలాలు అడుగడుగునా తన్ని, కృంగదీయవూ?

ఒక నిర్ణయానికివచ్చి గబగబ గదికి వెళ్ళింది. బట్టలుతీసి హోల్డాల్‌లో సర్దింది. కనబడిందల్లా పెట్టెలో కుక్కిపారేసింది. చివరికి పెట్టె తాళంవేసి బెడ్డింగుదాని మీద పెట్టింది.

అయిపోయింది. తనకీ ఈ గదికీ—ఈ ఊరికీ ఋణం తీరిపోయింది— ఎన్ని మధుర క్షణాలు గడిపింది ఇక్కడ. తన గత జీవితం, పడిన కష్టాలు అన్నీ మరిచిపోయేలా చేసింది ఈ వాతావరణం కొన్నాళ్ళపాటు. అయిపోయింది. మళ్ళీ జీవితంలో అంధకారం ఆరంభమయింది తనకి. ఆత్మహత్య చేసుకునేపాటి ధైర్యం, శక్తి తనకిలేవు. ఈ విశాల విశ్వంలో ఎక్కడో—ఏ మూలో తన జీవితం ఇలా నిర్జీవంగా సాగిస్తూ ఉండాలిసిందే! ఈ ఊరునుంచి మాత్రం తన పాత్రని నిష్క్రమింపజేస్తుంది!

ఇంటావిడ దగ్గర శలవు తీసుకుందామని బయటికి రాబోయింది సరస్వతి

గుమ్మంలో ప్రసాదరావు నిలబడి ఉన్నాడు!

"రాజేంద్ర ద్వారా కొంత విన్నాను. . . నేను అనుకున్నంతా చేస్తున్నారన్నమాట" అన్నాడు నిండుగా నవ్వుతూ.

తెల్లబోయింది సరస్వతి.

"ఎందాకా ప్రయాణం?" అడిగాడు.

"నిర్ణయించుకోలేదింకా" ముభావంగా అంది.

"అంతకాడికి బయలుదేరడం దేనికో?" నవ్వాడు.

ఇక లాభంలేదు—ఆయనకి కూడా తన గత చరిత్ర తెలియపర్చి మరీ పోవాలి. అప్పటికిగాని తన మనస్సుకి శాంతి ఉండదు.

"ప్రసాదరావుగారూ, ఇన్నాళ్ళు మిమ్మల్ని మోసం చేశాను. నా గత చరిత్ర మీకు చెప్పకుండా దాచాను..."

"నే నెప్పుడూ అడగలేదే!"

"అందుకేఇప్పుడు చెప్పవలసిన సమయంవచ్చింది!"

"చెప్పక్కర్లేదు—నాకంతా తెలుసు!" అన్నాడు తాపీగా ప్రసాదరావు. . . . "మీది గుంటూరు కదూ!"

అదిరిపోయింది సరస్వతి.

"మీకు ఇదివరకే పెండ్లయిందో!"

ఒకడుగు వెనక్కి వేసింది.

"ఆయన పోయాడు కూడా!"

ముఖాన్ని చేతులతో కప్పుకుని, "అవును—నేను విధవని. నన్ను పోనీయండి" అంటూ అతని పక్కనుంచి బయటకు పోబోయింది.

ఆమె భుజాలు రెండు చేతులతో పట్టుకుని ఆపి, ఆమె ముఖంలోకి చూసి నవ్వుతూ, "నీ ముఖాన 'విధవ' అని రాసిలేదే" అన్నాడు

"అంటే!" తెల్లబోతూ అడిగింది.

"నే నున్నంతకాలం నువ్వు సుమంగళివే సరస్వతీ— నీకు అభ్యంతరం లేకపోతే నువ్వు నా దానివి కావడం కన్న ఈ జన్మకి నేను కోరే దింకేమీలేదు" అన్నాడు ఆవేశంగా.

ఆశ్చర్యంతో అతని ముఖంలోకి చూసింది సరస్వతి

"అవును సరస్వతీ, అన్నీ తెలుసుకున్నాకే ఈ నిర్ణయానికి వచ్చాను నాతో అదృష్టం కలిగిస్తావా ?"

★